

## సందేశాత్మకంగా నాటికలు

రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండో రోజు నాటికలు సందేశాత్మకంగా ఉన్నాయి. - 8లో




## ఉద్యోగం వచ్చిన రెండు నెలలకే

కేరళలో జరిగిన రైలు ప్రమాదంలో కంబకాయ యువకుడు చనిపోయాడు. ఇతనికి ఉద్యోగం వచ్చి రెండు నెలలైంది. - 8లో

## 6న చెస్ క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో పాల్గొనే అండర్-19 చెస్ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ ఎన్.రామన్న తెలిపారు. ఉదయం 10గంటలకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తివివరాలకు ఫోన్ నంబర్ 6302546128ను సంప్రదించాలని చెప్పారు.

## న్యూస్‌రీల్

### 61 రోజులకు రూ.47.62 లక్షలు



హుండీ కానుకల లెక్కింపు జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీల కానుకల ద్వారా రూ.47,62,810 మేరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు శనివారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం అనివేటి మండపంలో నిర్వహించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి శనివారం వరకు హుండీల్లో లభించిన ఆదాయాన్ని లెక్కించిన క్రమంలో నగదు రూపంలో రూ.46,18,290, చిల్లర రూపంలో రూ.1,44,520 వరకు లభించగా, బంగారం 26.500 గ్రాములు, వెండి 2.200 కేజీల వస్తువులు కానుకల రూపంలో లభించాయి. జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బలివాడ ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు ప్రక్రియలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు ద్వారపు అనూరాధ అజిత్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

### శ్రీముఖలింగం హుండీ ఆదాయం రూ.2.77 లక్షలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ ఆదాయం రూ.2,77,654 వచ్చినట్లు ఈఓ పి.ప్రభాకరరావు శనివారం తెలిపారు. అర్చకులు, ఆలయ సిబ్బంది, సత్యసాయి సేవాసమితి భక్తుల ఆధ్వర్యంలో లెక్కించారు. గడిచిన 130 రోజులకు గాను హుండీ ఆదాయం లెక్కించినట్లు తెలిపారు.

### పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో ఉద్యోగ అవకాశాలు

శ్రీకాకుళం: పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్, డయాలసిస్ యూనిట్ సెంటర్‌కు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓటీ అసిస్టెంట్ 2 పోస్టులకు గాను ఏడోతరగతి పాస్ అయిన వారు కనీసం ఐదేళ్ల సర్వీస్ కలిగి ఏదైనా నర్సింగ్ హోమ్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి. అలాగే డయాలసిస్ టెక్నీషియన్ 4 పోస్టులకు గాను డిప్లమా ఇన్ డయాలసిస్ టెక్నీషియన్ కోర్సు చేసి ఏపీపీఎంబీ లేదా ఏపీ ఏహెచ్‌సీపీలో సర్టిఫికెట్ ఉండాలి. సీఆర్ఎం టెక్నీషియన్ రెండు పోస్టులకు డీఎంఎల్‌టీ కోర్సు చేసి ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లో ఎపీపీఎంబీ లేదా ఏపీఏహెచ్‌సీపీ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. జనరల్ డ్యూటీ అటెండెన్స్ 1 పోస్టుకు పదోతరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 6వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు రిమ్స్ జనరల్ ఆస్పత్రి, సూపరింటెండెంట్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

### 'బిల్లులు సకాలంలో సమర్పించాలి'



మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గౌరవ వేతనాల బిల్లులు సకాలంలో సమర్పించాలని డీఆర్‌ఓ ఎం.గణపతిరావు అన్నారు. గవర్నమెంట్ ప్లీడర్లు, ఏజీపీలతో శనివారం తన చాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. కోర్టు కేసుల్లో ఎలాంటి డీవియేషన్లు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులపై ఉన్న కేసులపై సమర్థంగా వాదించాలని కోరారు. సమావేశంలో జీపీ వినయభూషణ్, ఏజీపీ గొండు సత్యం, జిల్లాలోని పలు కోర్టుల ప్రభుత్వ న్యాయవాదులు హాజరయ్యారు.

# బడుగుకు పదవి పల్లెలకు లాభం జనులకు సంక్షేమం

ఓ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలి..? బడుగు బలహీన వర్గాల వారికి రాజకీయ అధికారం ఇవ్వాలి. ఉన్న వనరులను సమర్థంగా వాడుకోవాలి. దశాబ్దాల సమస్యలను పరిష్కరించాలి. కొత్త ప్రగతి దారులు వేయాలి. అట్టడుగు వర్గాల బతుకులు మార్చాలి. క్లుప్తంగా చెప్పాలంటే పలాస నియోజకవర్గానికి ప్రభుత్వం ఏం చేసిందో అవి చేయాలి. మత్స్యకార సామాజికవర్గానికి చెందిన సీదిరి అప్పలరాజుకు మంత్రి పదవి ఇవ్వడం, కిడ్నీ సమస్య పరిష్కారానికి రీసెర్చ్ సెంటర్ నిర్మించడం, అతి పెద్ద మంచినీటి ప్రాజెక్టు ఏర్పాటు చేయడం, కీలకమైన మూలపేట పోర్టు నిర్మాణం, పట్టణంతో పాటు పల్లెలకూ రోడ్లు.. ఇవి సర్కారు చేసిన పనుల్లో పదిశాతమే. ఈ మేలును చెప్పడానికి వైఎస్సార్ సీపీ నాయకులు పలాసలో నేడు సామాజిక సాధికార యాత్ర నిర్వహించనున్నారు.




- పలాసపై ప్రత్యేక ప్రేమ చూపిన వైఎస్సార్ సీపీ సర్కారు
- వేల కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.1500 కోట్లకుపైగా సంక్షేమ పథకాల రూపంలో అందజేత
- మేలును వివరించేందుకు నేడు సామాజిక సాధికార బస్సు యాత్ర

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పలాస నియోజకవర్గ రాజకీయ చరిత్రను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరగరాశారు. ఇన్నాళ్లూ అణగారిపోయి ఉన్న బడుగు, బలహీన వర్గాల వారిని గుండెల్లో పెట్టుకుని సమున్నతంగా గౌరవించారు. సిఫార్సులతో పనిలేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అందించారు. నాయకులు అడిగిన ప్రతి పనినీ ఆమోదించారు. ఈ మంచిని జనాలకు చెప్పేందుకు ఆదివారం పలాసలో సామాజిక సాధికార బస్సు యాత్రను వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తోంది.

### బడుగులకు రాజకీయ పదవులు



మత్స్యకార కుటుంబానికి చెందిన సీదిరి అప్పలరాజుకు మంత్రి పదవి కేటాయించి వైఎస్ జగన్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. మంత్రి పదవితో మొదలుపెడితే కాళింగ సామాజిక వర్గానికి చెందిన బల్ల గిరిబాబును మున్సిపల్ చైర్మన్‌గా, యాదవ సామాజిక వర్గానికి చెందిన పాలిన శ్రావణిని జెడ్పీ వైస్ చైర్మన్‌గా, అగ్నికుల క్షత్రియ కులానికి చెందిన ఉప్పరవిల్లి నీలవేణిని వజ్రపుకొత్తూరు ఎంపీపీగా, యాదవ సామాజిక వర్గానికి చెందిన డొక్కరి దానయ్యను మందస ఎంపీపీగా, పలాస ఎంపీపీగా యాదవ సామాజిక వర్గానికి చెందిన ఉంగా ప్రవీణను ఎంపిక చేశారు. పలాస మున్సిపల్ వైస్ చైర్మన్లుగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన బోర కృష్ణారావును, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మీసాల సురేష్‌బాబును ఎంపిక చేశారు. నీటి పారుదల శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా కాళింగ సామాజిక వర్గానికి చెందిన మల్లా రవికుమార్‌ను నియమించారు. ఏఎంసీ చైర్మన్‌గా కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన పీవీ సతీష్‌ను నియమించారు. ఇలా అన్ని వర్గాల వారికీ రాజకీయ పదవులు కేటాయించి వారిని రాజ్యాధికారంలో భాగం చేశారు.

### అర్హతే ప్రామాణికంగా సంక్షేమం..



అర్హులకు పథకాలు అందించడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. పలాసలోనూ ఒక్క పైసా అవినీతి లేకుండా కోట్లాది రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇందులో 90 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చేరాయి. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద నియోజకవర్గంలో దాదాపు రూ.910కోట్ల వరకు సంక్షేమ పథకాలకు కింద జమ చేశారు. నాన్ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద ఇళ్ల స్థలాలు, గోరుముద్ద, జగనన్న తోడు రుణాలు, రేషన్, ట్యాబ్‌లు పంపిణీ, విద్యా కానుక, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కోసమ ని మరో రూ.600కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు చేసింది. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల ఆధునికీకరణ, విలేజ్ హెల్త్ క్లినిక్, వెటర్నరీ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు తదితర వాటికి వందల కోట్లు ఖర్చు చేసింది. ఇంగ్లిష్ మీడియం పేద పిల్లలకు వరమైంది.

## చేసిన మేలులో కొన్ని..




- ఉద్దానంను పట్టిపీడిస్తున్న కిడ్నీ వ్యాధిని నియంత్రించేందుకు రూ.**700** కోట్లకు పైగా ఖర్చు పెట్టి భారీ మంచినీటి ప్రాజెక్టు(వాటర్ గ్రిడ్)ను నిర్మించింది. పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ప్రారంభం కానుంది.
- కిడ్నీ వ్యాధిని అదుపులోకి తెచ్చేందుకు పలాసలో రూ.**50**కోట్లకు పైగా వ్యయంతో కిడ్నీ రీసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించింది.



- జిల్లాకే తలమానికంగా నిలిచే మూలపేట పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే 25వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.



- వజ్రపుకొత్తూరు మండలం నీళ్లపేటలో రూ.**11.95** కోట్లతో జెట్టీ నిర్మిస్తోంది. దానినే ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేసి నిర్మించడానికి అనుమతులు మంజూరు చేసింది.
- 26 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, పలాస పట్టణానికి తాగునీరు అందించేందుకు మహేంద్ర తనయ వద్ద రూ.**852.45**కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు చేపడుతోంది.
- రూ. **173**కోట్లతో నిర్మిస్తున్న వంశధార లిఫ్ట్‌తో పలాస నియోజకవర్గ శివారు భూములకు సాగునీ రు అందించేలా చర్యలు తీసుకుంది.



- వంశధార ప్రధాన ఎడమ కాలువపై నరేంద్రపురం కణితూరు మధ్య వంతెన నిర్మాణం జరిగింది. రూ.**1.58** కోట్లతో నిర్మించిన వంతెనతో పూండి ఉద్దానం నుంచి నందిగాం మండలంలోని 42 గ్రామాలకు రహదారి సమస్య తీరింది.



- రూ.**100.09** కోట్లతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి అర్బన్ వాటర్ స్కీంతో ఇంటింటికి తాగునీరు అందించే కార్యక్రమం చేపట్టింది.
- నియోజకవర్గంలో అతి పెద్ద ముఖ్య మైన బీటీ రోడ్లు రూ.**21** కోట్లుతో కాశీబుగ్గ-వజ్రపుకొత్తూరు (19 కిలోమీటర్లు), రూ.**19** కోట్లతో టెక్కలిపట్నం-నువ్వలరేవు రోడ్డు నిర్మాణం చేపట్టింది.
- ఏఎంసీ నిధులు రూ.**9** కోట్లతో వంతెనలు, బీటీ రోడ్లు వేసింది.
- రూ.**18** కోట్లుతో కాశీబుగ్గ రైల్వే ఫ్లైవోవర్ పునఃనిర్మాణ పనులుకు మంజూరు చేయడమే కాకుండా, బాధితులకు రూ.**4.34** కోట్లు ఆర్ అండ్ అర్ ప్యాకేజీ, విలువైన ఇంటి స్థలాలు అందజేసింది.
- జంట పట్టణాల్లో 2555 ఇళ్లతో అతిపెద్ద జగనన్న కాలనీ 49 ఎకరాల్లో ఏర్పాటు చేసింది.
- పలాస జీడిపప్పునకు ప్రపంచస్థాయి గుర్తింపు తెప్పించడమే కాకుండా రాష్ట్రంలోని 14 వస్తువుల్లో పలాస జీడికి ప్రత్యేకమైన గుర్తింపు కల్పించింది.
- పలాసను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది. హరిపురంలో కొత్త డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసింది.
- మందస మండలంలోని అన్ని గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు.



- పలాసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హరిపురం, వజ్రపుకొత్తూరు, బ్రాహ్మణతర్లాకు మహిళా జూనియర్ కళాశాల మంజూరు చేసింది.
- జీడి పరిశ్రమలకు 2014 నుంచిరావాల్సిన ప్రోత్సాహకాల కింద రూ.**120** కోట్లు విడుదల చేసింది.

### 'యాత్ర విజయవంతం చేయండి'



మాట్లాడుతున్నమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని రాష్ట్ర పశుసంవర్థక పాడిపరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు. పలాసలో మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి యాత్రపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఈ యాత్రకు స్పీకర్ తమ్మినేని సీతారాం, రీజనల్ కోఆర్డినేటర్స్ వైవీ సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నాయకులు హాజరవుతారని తెలిపారు. నాలుగున్నరేళ్లలో అధిక శాతం పదవులను బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఒక్క రూపాయి లంచం లేకుండా సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. బస్సు యాత్ర శ్రీకాకుళం నుంచి ఉదయం 10.15కు ప్రారంభమవుతుందని, అక్కడి నుంచి టెక్కలి చేరుకుని ప్రెస్‌మీట్‌లో పాల్గొంటామని, ఆ తర్వాత పలాస వెళ్లి మధ్యాహ్న భోజనాలు అయ్యాక 2 గంటలకు కోసంగిపురం జంక్షన్ చేరుకుంటామని పేర్కొన్నారు. 2.30 గంటలకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పరిశీలన, అక్కడి నుంచి కాశీబుగ్గ సంత మైదానంలో ఉన్న వైఎస్సార్ స్క్వేర్ వరకు యాత్ర సాగుతుందని తెలిపారు. 3 గంటలకు కేటీ రోడ్డులో ఏర్పాటు చేసిన సామాజిక సాధికార యాత్ర సభా వేదిక వద్దకు చేరుకుంటామని వివరించారు.

'సాక్షి' గ్రూప్-1, గ్రూప్-2 అవగాహన సదస్సుకు

# అపూర్వ స్పందన



అవగాహన సదస్సుకు హాజరైన అభ్యర్థులతో కిటకిటలాడుతున్న సెమినార్ హాల్ ప్రాంగణం

- శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు
- హాజరైన సివిల్స్ విజేత బాలలత
- బాలలతను స్ఫూర్తిగా తీసుకోవాలన్న స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న బాలలత

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై అవగాహన సదస్సుకు అపురూప స్పందన లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్పీకర్ తమ్మినేని సీతారాంతోపాటు సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నుంచి బాలలత హాజరై వందలాదిగా వచ్చిన అభ్యర్థులకు సివిల్స్, గ్రూప్స్ తదితర పరీక్ష సన్నద్ధతపై కూలంకుషంగా అవగాహన కల్పించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అభ్యర్థులు ఎంతో కష్టపడి పట్టుదలగా చదువు తారని బాలలత అన్నారు. శ్రీకాకుళంలో సైని కులు, టీచర్లు అధికంగా ఉంటారని గుర్తుచేశారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణకు ఆతిథ్యమిచ్చిన కళాశాల అధికారులకు, సదస్సును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి సాక్షి బీఎం బీజేజీవీఆర్ స్వామి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, కళాశాల లెక్చరర్లు కె.జ్యోతిలక్ష్మి, ఎస్.రుద్రమరాణి, సీహెచ్ కృష్ణారావు, కృష్ణారావు, శ్రీకాకుళం లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణరావు పాల్గొన్నారు.

**సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి**

లక్ష్యసాధన కోసం ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని స్పీకర్ తమ్మినేని సీతారాం యువత, నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. సీఎం జగన్ చొరవతో 17 ఏళ్ల తర్వాత యూనివర్సిటీల్లో ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ 3220 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సాక్షి మీడియా చేపడుతున్న కార్యక్రమాలను స్పీకర్ తమ్మినేని మెచ్చుకున్నారు. సాధించాలనే తపన, లక్ష్యం ముందు వైకల్యం కూడా చిన్నబోతుందని బాలలతను ప్రశంసిస్తూ పేర్కొన్నారు.

### సమయపాలన ముఖ్యం

సివిల్స్, గ్రూప్స్‌కు ప్రిపేరయ్యే వారికి సమయపాలన ముఖ్యమని బాలలత సూచించారు. పోలియో డ్రాప్స్ కారణంగా తన కాళ్లకు సమస్య వచ్చిందని, స్కూల్‌కు కూడా సరిగా వెళ్లలేకపోయానని చెప్పారు. తాను టెన్త్, ఇంటర్ ప్రైవేటుగా కట్టి పాస్ మార్కులతో ఉత్తీర్ణత సాధించానని, డిగ్రీ బీఏ దూరవిద్య ద్వారా పూర్తిచేశానని చెప్పారు. అనంతరం హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌లో అవమానాలు పడ్డానని.. 2004లో ఆలిండియాలో 399వ ర్యాంకు సాధించానని, మళ్లీ 2016లో 167వ ర్యాంకు సాధించానని చెప్పారు. తన ఉద్యోగ ప్రయత్నం తొలినాళ్లలో తాను నడవలేనందుకు కాదు.. పది మందినీ నడిపించలేకపోతున్నందుకు బాధ కలిగిందని, దివ్యాంగులను వేరుగా చూడకూడదని, అందరితో సమానంగా చూడాలనేది తన అభిమతమని అన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఆలిండియా 3వ ర్యాంక్ సాధించిన రోణంకి గోపాలకృష్ణకు తాను కొన్ని టాపిక్స్‌లో మార్గనిర్దేశం చేశానని చెప్పడంతో సభాప్రాంగణం చప్పట్లతో మార్మోగిపోయింది. సివిల్స్ అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సాహాన్ని అందించడం శుభపరిణామమని అన్నారు.

### చక్కగా వివరించారు..



పరీక్షకు సన్నద్ధమవ్వడం, సిలబస్, పేట్రన్, కంటెంట్, సమయపాలన, మోటివేషన్ వంటి అంశాలను బాలలత విపులంగా వివరించారు. బాలలత మేడంకు థాంక్స్ చెబుతున్నాం.

– బి.నాగమణి, గ్రూప్స్ అభ్యర్థిని

### 'సాక్షి'కి ధన్యవాదాలు..



శ్రీకాకుళంలో గ్రూప్-1, గ్రూప్-2పై అవగాహన సదస్సును నిర్వహించిన సాక్షి మీడియాకు విద్యార్థి లోకం తరపున ధన్యవాదాలు. బాలలత మేడం శ్రీకాకుళం వచ్చి అవగాహన కల్పించడం సంతోషదాయకం.

– దివ్యశ్రీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థిని

### సంతోషంగా ఉంది..



సాక్షి మీడియా నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది. పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న మాకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగింది. సాక్షి మీడియాకు థ్యాంక్స్.

– పి.సాయిలక్ష్మి, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని




అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

## క్లుప్తంగా

### ఉద్యోగం వచ్చిన రెండు నెలలకే..


మృతి చెందిన నవీన్ (ఫైల్)

**నరసన్నపేట:** ఉద్యోగం వచ్చిన రెండు నెలలకే ఓ యువకుడు ఆ విధి నిర్వహణలో అసువులు బాసాడు. రెండు నెలల కిందట ఆర్‌ఆర్‌బీ గ్రూప్–4 ఉద్యోగంలో చేరిన కంబకాయకు చెందిన పాగోటి నవీన్(25) ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. కేరళలోని కంబాల రైల్వే స్టేషన్ సమీపంలో డ్యూటీలో ఉన్న నవీన్ శనివారం వేకువజామున రైలు కింద పడి మృతి చెందాడు. కంబాల వద్ద రైల్వే ట్రాక్‌పై పనిచేస్తున్నప్పుడు ప్రమాదవశాత్తు రైలు కింద పడిపోయాడని రైల్వే అధికారులు సమాచారం ఇచ్చినట్లు వీఆర్‌ఓ పాగోటి రేవతి తెలిపారు. మృతుని సోదరుడు మన్మధరావు ఆర్మీలో పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాగోటి అప్పలరాజు, పద్మావతిలు గుండెలవిసేలా రోదించారు. నవీన్ మృతిపై కంబకాయ సర్పంచ్ పాగోటి కుసుమ కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు పాగోటి భరద్వాజ్, పాగోటి ప్రభాకరరావు సంతాపం వ్యక్తం చేశారు.

### వాహనం ఢీకొని అడవి జంతువు మృతి


బేసి రామచంద్రాపురం వద్ద మృతి చెందిన అడవి జంతువు


**సోంపేట:** బేసిరామచంద్రాపురం గ్రామం సమీపంలో జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని శుక్రవారం రాత్రి అడవి జంతువు మృతి చెందింది. స్థానికులు శనివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించారు. అడవి పిల్లి అయి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. అటవీ శాఖాధికారులకు సమాచారం అందజేశారు.

### కారు ఢీకొని వృద్ధుడు మృతి


ఘటన స్థలంలో కృష్ణారావు మృతదేహం

**టెక్కలి రూరల్:** మండలంలోని అక్కవరం జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కళింగపట్నం కృష్ణారావు(60) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన కృష్ణారావు అక్కవరం వచ్చి పనులు ముగించుకుని తిరిగి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా అటుగా నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వస్తున్న డబ్ల్యూబీ66ఎపి8777 నంబర్ గల కారు ఆయనను ఢీకొట్టింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. అయితే ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ కారును వెంబడించి పట్టుకున్నారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి ఎస్ఐ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 'ఆధునిక సాంకేతికత సద్వినియోగం చేసుకోండి'


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జునైద్ అహ్మద్ మౌలానా

**గార:** ఆధునిక సాంకేతికతను జ్ఞానానికి ఉపయోగించాలని, దుర్వినియోగం చేయవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. వమరవల్లిలోని డైట్‌లో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అనవసరంగా కాలయాపన చేయరాదన్నారు. టెక్నాలజీ వల్ల అనేక ఉపయోగాలు ఉంటాయని, అదే సమయంలో నష్టం ఉంటుందన్నారు. మన ఆలోచన సరళి సరైన గమ్యంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధిక సంస్థ కార్య దర్శి ఆర్.సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్ తిరు మల చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ భారతమ్మ, డైట్ కళాశాల లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

## • వెండి మబ్బుల పల్లకిలో..



ఈదుపురం నుంచి ఇచ్ఛాపురం వెళ్లే రోడ్డులో వెండి మబ్బులు శనివారం ఉదయం కనువిందు చేశాయి. ఇచ్ఛాపురం కోటేరు బంద వద్ద అయితే చూపు తిప్పుకోనివ్వనంత అందంగా అలరించాయి. బాటసారులు, వాహనదారులు ఈ దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు.

– ఇచ్ఛాపురం రూరల్

# 'ఐదు రోజుల్లో నగదు జమ చేస్తాం'


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ సప్లై కమిషనర్ అరుణ్‌కుమార్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** రైతు సంతృప్తే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఉండాలని, పండించే ప్రతి గింజ కొనుగోలు చేస్తామని సివిల్ సప్లయిస్ కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్ ఆదేశించారు. ఈ సారి ఐదు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో శనివారం ఆయన పర్యటించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో సమీక్షించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ, జిల్లాలోని పరిస్థితిని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు చేస్తున్న ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది సుమారు 8,17,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. దీనిలో స్థానిక అవసరాలు పోనూ, మార్కెట్‌కు సుమారుగా 7,87,447 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని, దీనిలో దాదాపు 5,40,,000 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలో 626 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయని, వాటిని 390 క్లస్టర్లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబరు 15 నాటికి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని చెప్పారు. ఒడిశా నుంచి అక్రమంగా వచ్చే బియ్యం రవాణా అరికట్టేందుకు విజిలెన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ధాన్యం కనీస మద్దతు ధర దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుకే చేరేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను వెల్లడించారు. ఆర్‌బీకేల నుంచి మిల్లు వరకూ జీపీఎస్ ట్రాకింగ్, ధాన్యం మిల్లుల్లో విద్యుత్ వినియోగం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. లక్ష్యంతో సంబంధం లేకుండా రైతులు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేయాలని సూచించారు. బయో మెట్రిక్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, ఏదైనా అంతిమంగా రైతులకు మేలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మిల్లు సామర్థ్యం బట్టే లక్ష్యాలు కేటాయించాలని, ఎక్కువ బ్యాంకు గ్యారంటీ ఇచ్చినా, సామర్థ్యం కంటే అదనంగా ధాన్యం కేటాయించవద్దని స్పష్టం చేశారు. ఒక్కో ఆర్‌బీకేకి 10 నుంచి 15 వాహనాలను కేటాయించాలని, ప్రతి వాహనానికి జీపీఎస్ పరికరాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోనె సంచులు, లేబర్ ఖర్చులను రైతులే చెల్లిస్తే, వారికే జమ చేస్తామని చెప్పారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కే.శ్రీధర్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీనివాసరావు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ పీఆర్‌ఓ లాడె రమేష్, స్వీప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రమణమూర్తి, జిల్లా రవాణా శాఖాధికారి ఇతర జిల్లా అధికారులు, సివిల్ సప్‌లైస్ డిటిలు, పాక్స్ డీసీఎంఎస్, జీఈసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'చివరి పౌరుని వరకు సంక్షేమం అందాలి'


సమావేశంలో కొన్ని అంశాలపై ప్రజాప్రతినిధులు నివేదన


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

**శ్రీకాకుళం క్రైమ్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలను గ్రామస్థాయిలో చివరి పౌరుని వరకు సక్రమంగా అందేలా చూడాలని, తద్వారా ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేలా అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో సభ్య కార్యదర్శి హోదాలో ఆయన మాట్లాడారు. మానవ వనరుల నిర్వహణ, బయో మెడికల్ సాలిడ్, లిక్విడ్ మేనేజ్‌మెంట్, పలు శాఖల పరిధిలోని నిర్మాణాల స్థితిపై చర్చించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన పలు సమస్యలపై క్షేత్ర పర్యటనలు నిర్వహించి పరిష్కరించాలని, ఉపాధి హామీ పథకం, జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కార్యక్రమం, మున్సిపాలిటీలో అమలవుతున్న అమృత్ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిర్మిస్తున్న ఇళ్లు, స్త్రీ శిశు సంక్షేమశాఖ అమలు చేస్తున్న పథకాలపై మాట్లాడారు. ఇచ్ఛాపురంలో చెరువులపై ఆక్రమణలు తొలగించాలని అమృత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ సీఈఓ ఆర్.వెంకటరామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, డీఆర్డీ పీడీ ఎల్.విద్యాసాగర్, ఐసీడీఎస్ పీఓ బి.శాంతి, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఎస్‌వో వెంకటరమణ, హౌసింగ్ పీడీ గణపతిరావు, జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పలాస, కాశీబుగ్గ చైర్మన్ బళ్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### అంతర్‌రాష్ట్ర టోర్నీకి కుముదిని ఎంపిక


డి.కుముదిని

**శ్రీకాకుళం న్యూకాలనీ:** అంతర్ రాష్ట్ర అండర్–15 బాలికల క్రికెట్ టోర్నమెంట్‌కు శ్రీకాకుళం జిల్లాకు చెందిన దుడ్డు కుముదిని ఎంపికైంది. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి వర్తమానం అందింది. ఈనెల 17 నుంచి డెహ్రాడూన్‌లో జరగనున్న ఈ టోర్నమెంట్‌లో కుముదిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలికల జట్టు తరఫున ఆడుతుంది. ఈ టోర్నీకి ముందు ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న శిక్షణ శిబిరాల్లో పాల్గొంటుంది. శ్రీకాకుళంలో నివాసం ఉంటున్న వీరి స్వస్థలం గార మండలం అంపోలు గ్రామం. తండ్రి దుడ్డు రమణ(మహేష్) తపాలాశాఖలో పనిచేస్తుండగా, తల్లి తేజేశ్వరి గృహిణి. దుడ్డు కుముదిని అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీకి ఎంపిక కావడంపై జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

### డిప్లమా పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల గడువు పెంపు

**శ్రీకాకుళం రూరల్:** మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్‌లో డిప్లమా పారా మెడికల్ కోర్సుల కన్వీనర్ కోటా దరఖాస్తులకు గడువును నవంబర్ 10 వరకూ పెంచామని బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ఈనెల 18 వరకు అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్ ఏ గ్రూప్ విద్యార్థులైనా అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాల్లో కన్వీనర్ కోటా కింద మేనేజ్‌మెంట్ సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 7680945457, 9121999654 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### రిటైర్డు హోంగార్డుకు చేయూత


చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక


**శ్రీకాకుళం క్రైమ్ :** రిటైర్డ్ హోంగార్డు కె.త్రినాధరావుకు ఎస్పీ జి.ఆర్.రాధిక చేతుల మీదుగా శనివారం ఆర్థిక సాయం అందించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సహోద్యోగుల ఒక్కరోజు వేతనం రూ. 4.21 లక్షలను చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.వి.నర్సింగరావు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో డీఎఫ్‌ఓ పర్యటన


ఏఓబీలో పులి సంచారంపై ఆరా తీస్తున్న డీఎఫ్‌ఓ నిషాకుమారి

**మందస:** మందస మండలంలో పెద్దపులి సంచారం ఉన్నట్టు అటవీశాఖాధికారులు గుర్తించారు. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని గిరిజన ప్రాంతాల్లో పులి పాదముద్రలను శనివారం సేకరించారు. చీపి పంచాయతీలోని బొందికరి, పుట్టూరు, కొండమేర, బారగాం, డాలసరి తదితర ప్రాంతాల్లో పులి పాదముద్రలను గుర్తించిన గిరిజనులు అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో జిల్లా అటవీశాఖాధికారి నిషాకుమారి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. గూగుల్ మ్యాప్ ద్వారా పులి సంచరిస్తున్న ప్రాంతాలను తెలుసుకున్నారు. అనంతరం అటవీశాఖాధికారులతో మాట్లాడుతూ ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కంచిలి మండలంలో తిరిగిన పులి మహేంద్రతనయ నదీ పరివాహక ప్రాంతం నుంచి మందస మండలంలో ప్రవేశించింది. అటవీ ప్రాంతం నుంచి గిరిజన ప్రాంతానికి వెళ్లినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. కొండమేర, పుట్టూరు అడవుల్లో అత్యాధునిక కెమెరాలను అమర్చారు. లాట్‌లాంగ్స్ కనుగొని, పులి సంచరిస్తున్న ప్రదేశాలను కనుగొనడానికి ప్రయత్నిస్తున్న కాశీబుగ్గ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు చెప్పారు. పెద్దపులి ఆనవాళ్లు సేకరించడానికి ఫారెస్ట్ సెక్షన్ అధికారులు పి.రాజు, బి.వి.రెడ్డి, ఫారెస్ట్ బీట్ అధికారులు టి.వెంకటేశ్, ఎం.పోలయ్య, ఎస్.దుర్గాదేవి, ఆర్.వినీల, ఎ.బాబురావు, ఆర్.సంతోష్‌కుమార్ శ్రమిస్తున్నారు.

# సందేశాత్మకంగా నాటికలు


మిణుగురు వెలుగులు నాటికలో ఓ సన్నివేశం

**శ్రీకాకుళం కల్చరల్:** శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో జరుగుతున్న నాటిక పరిషత్ పోటీల్లో శనివారం ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా ఉన్నాయి. యదార్థ సంఘటనలకు ప్రతి రూపంగా ఏ ప్రభుత్వ శాఖలో పనిచేసేవారు ఆ శాఖలో నీతి నియమాలు కలిగి ఉండాలని తెలియజేస్తూ విశాఖకు చెందిన కళాభినయ, పార్వతీనగర్ వారు 'కన్నెర్ర' నాటికను ప్రదర్శించారు. పీటీ మాధవ్ రచించగా, కవిప్రసాద్ దర్శకత్వం వహించారు. అలాగే చిలకలూరిపేటకు చెందిన సుకృతి క్రియేషన్స్ వారి 'మిణుగురు వెలుగులు' నాటిక చక్కగా సాగింది. ఈ నాటికను కె.ఆదిత్య రచించగా, కె.వి.మంగారావు దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అతిథిగా హాజరైన గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ కళాకారుల సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. తెలుగు నాటక రంగం పరిషత్తుల నిర్వహణతోనే నిలుస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక నాటక పరిషత్‌ల సమాఖ్య కార్యదర్శి జవ్వాది దాశరధి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా పేద కళాకారులకు నెలవారీ అందించే రూ.400లు పింఛను 30మంది కళాకారులకు అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పీఎంజే బాబు, చిట్టి నాగభూషణరావు, సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వేంకటరావు, పన్నాల నర్సింహమూర్తి, ఎల్.రామలింగస్వామి, రామచంద్రదేవ్, నిక్కు హరి సత్యన్నారాయణ, పైడి సత్యవతి, కలగ గణేష్ యాదవ్, ఇంజరాపు రమణారావు, మెట్ట పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత

**శ్రీకాకుళం అర్బన్:** శ్రీకాకుళం ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మరణించిన అంధ ఉద్యోగి వై.వెంకటప్పడు భార్య చల్లా కోటేశ్వరికి శనివారం కారుణ్య నియామకం కింద పొందూరు ప్రభుత్వ హైస్కూల్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, జిల్లా విద్యాశాఖాధికారి సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు, కార్యాలయ సూపరింటెండెంట్ బి.వి.నర్సింగరావు, ఏపీ ఎన్‌జీవో సంఘ ప్రతినిధులు, క్లాస్–4 ద్యోగుల జిల్లా కార్యదర్శి చింతల ఉమాశంకర్, మీసాల రామకృష్ణ పాల్గొన్నారు.

# 'వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం'


'వలంటీర్' సినిమా ప్రోమోను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు

**టెక్కలి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకృష్ణ లీలా ప్రొడక్షన్స్‌పై రాజు నిర్మాతగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సారథ్యంలో నిర్మించిన 'వలంటీర్' సినిమా ప్రోమోను శనివారం టెక్కలి అక్కవరం సమీపంలో ఎమ్మెల్సీ దువ్వాడ క్యాంపు కార్యాలయం వద్ద ఆయన ఆవిష్కరించారు. అంతకు ముందు ఎమ్మెల్సీ దువ్వాడకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు తో పాటు నాయకులు దువ్వాడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల్లో డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు


వర్సిటీలో నిర్వహించిన డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమంలో అధికారులు.

**ఎచ్చెర్ల క్యాంపస్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఫోన్ కాల్ ద్వారా తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు సంక్రాంతి సెలవుల తర్వాత జనవరి నెల చివరి వారంలో ప్రారంభిస్తామని తెలిపారు. డిగ్రీ రెండో సెమిస్టర్ మూల్యాంకనం త్వరగా పూర్తి చేసి ఫలితాలు విడుదల చేయాలని విద్యార్థులు కోరారు. 2018–2020 ఏడాదుల్లో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఉపకార వేతనాలు అందలేదని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకురాగా, పూర్తి వివరాలతో విద్యార్థులు వినతి పత్రం అందజేయాలని, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళతామని అన్నారు. వర్సిటీ క్యాంపస్ విద్యార్థులకు ఒరిజనల్ డిగ్రీ సర్టిఫికెట్లు అందజేయటంలో జాప్యం జరుగుతోందని విద్యార్థులు అధికారులు దృష్టికి తీసుకురాగా, ప్రత్యేక దృష్టిపెడతామని అన్నారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పీలా సుజాత, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం వద్దు

• కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్


ప్రత్యేక ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

**జి.సిగడాం:** ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆయన శనివారం పాలఖండ్యాం, జగన్నాథపురం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు సమర్థంగా పనిచేసి పక్కాగా జాబితా తయారు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ఓటర్ల నుంచి అభ్యంతరాలు ఉంటే వాటిని పరిష్కరించాలని సూచించారు. రాజకీయ పార్టీ నాయకుల ద్వారా గ్రామసభ ఏర్పాటు చేసుకుని ఓటర్ల మార్పులు, చేర్పుల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గం ఎన్నికల రిట్నరింగ్ అధికారి బెవర పద్మావతి మండల అసిస్టెంట్ రిట్నరింగ్ అధికారి పప్పల వేణుగోపాలరావు శ్రీనివాసరావు, సూపర్ వైజర్లు బూత్ లెవల్ అధికారులతోపాటు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దూడపై గుర్తు తెలియని జంతువు దాడి


మృతిచెందిన ఆవు దూడను పరిశీలిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి తదితరులు

**కంచిలి:** మండలంలోని జాడుపూడి గ్రామంలో గల జీడితోటలో ఓ ఆవు దూడపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి హతమార్చింది. ఈ విషయాన్ని శనివారం వేకువజామున గుర్తించారు. ఈ దూడ స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు జామి జయకు సంబంధించినది. ఆమెకు చెందిన జీడితోటలో నాలుగు ఆవులు, ఈ ఆవుదూడను కట్టి ఉంచారు. శనివారం ఉదయం పాలు పిండటానికి ఆమె భర్త నీలకంఠం వెళ్లేసరికి దూడ పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయారు. గ్రామంలో ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొన్నారు. ప్రస్తుతం పెద్ద పులి తిరుగుతుండడంతో అంతా భయపడ్డారు. అటవీ అధికారులు అక్కడకు చేరుకుని అడుగుల పరిమాణం పరిశీలిస్తే 7 సెంటీమీటర్లు పొడవు, 5 సెంటీమీటర్లు వెడల్పు గల పాదముద్రలు ఉండడంతో పులి కాదని నిర్ధారించుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకొని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని, పరిస్థితిని పరిశీలించారు.